ఎపిఇఎపి ప్రవేశ పరీక్ష ప్రారంభం

పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

విజయనగరం టౌన్: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశాలకు నిర్వహించే ఎపిఇఎపిసెట్ సోమవారం ప్రారంభమైంది. ఆన్‌లైన్ విధానంలో ఏడు రోజుల పాటు ఉదయం, మధ్యాహ్నం రోజుకు రెండు విడతల చొప్పున ఈ పరీక్షలు జరుగుతాయి. 15 నుంచి 19 తేదీల్లో ఇంజినీరింగ్, 22, 23 తేదీల్లో వ్యవసాయం/ ఫార్మసీ పరీక్షలు నిర్వహిస్తారు. ఉమ్మడి జిల్లాలో ఇంజినీరింగ్‌కు 8,202, వ్యవసాయం/ఫార్మసీకి 3,883 మంది పోటీ పడుతున్నారు. జిల్లాలోని సీతం, ఎంవిజిఆర్, లెండీ, జిఎంఆర్, స్వామి వివేకనంద కళాశాలల కేంద్రాల్లో పరీక్ష జరిగింది.

ఒక్క పూటే పని పెట్టాలి

- వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్
- కలెక్టరేట్ వద్ద ఉపాధి వేతనదారుల ధర్నా

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిసంఘం నాయకులు గంగునాయుడు

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఉపాధి హామీ కూలీలకు ఒక్క పూటే పని పెట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ వేతనదారుల సమస్యలపై ధర్నా జరిగింది. ఈ సందర్భంగా కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం ప్రజా సంఘాలు, వామపక్షాలు పోరాడి సాధించాయన్నారు. ఈ చట్టం వల్ల వ్యవసాయ కూలీలు, వలస కూలీలు, నిరుద్యోగ యువతీ యువకులు, రైతులు, కౌలు రైతులంతా గ్రామీణ ప్రాంతంలో ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. అటువంటి ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేయడానికి ప్రధాని నరేంద్ర మోడీ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఇందులో భాగంగానే ఉపాధి హామీ పథకం గతంలో ఒక్క పూట పని చేసేవారని, రెండో పూట తమ సొంత వ్యవసాయ పనులు చేసేవారని, అలాగే గతంలో మంచి నీరు, మజ్జిగ ఇచ్చేవారని, ప్రాథమిక చికిత్స కిట్లు ఇచ్చే వారని, వేసవి అలవెన్సు, 20 నుంచి 30 శాతం ఇచ్చేవారని, మేట్లకు ప్రోత్సాహకాలు ఇచ్చేవారని, ఇప్పుడు ఇవన్నీ తీసివేసి ఉపాధి కూలీలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. రెండు పూటలా పని పెట్టడం వల్ల కూలీలు ఎండలో సుదూర ప్రాంతాలకు నడిచివెళ్తున్నారని, కొన్ని మండలాల్లో ఒక్కొక్క కూలీ రోజుకు 20కిలో మీటర్లు వరకు నడవాల్సి వస్తుందని అన్నారు. అనేక మంది వడదెబ్బకు గురై చనిపోతున్నారని, తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారని అన్నారు. కావున ఉపాధి కూలీలంతా కలిసికట్టుగా పోరాడి ఒక్క పూట పని చేసేలా, ఏడాదికి 200 రోజులు పని దినాలు, రోజుకూలి రూ.600 కూలి చెల్లింపు, ఇతర సమస్యలు పరిష్కరించు కోవాలన్నారు. నరేంద్ర మోడీ, బిజెపి, జగన్ మోహన్ రెడ్డిలకు బుద్ధి చెప్పాలని, కర్ణాటకలో ప్రజలు వలే దేశమంతా ఓడించాలని కోరారు. అనంతరం ఇన్చార్జ్ జాయింట్ కలెక్టర సి.విష్ణు చరణ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు, సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, మోహన్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, కౌలు రైతులు సంఘం జిల్లా కార్యదర్శి రమణమూర్తి, పలువురు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

- ఐదు నెలలుగా కొనుగోలు చేయని టిటిడి
- 'జగనన్నకు చెబుదాం' అంటూ కలెక్టరేట్‌కు నాలుగోసారి వచ్చిన కర్షకులు
- ఆశపెట్టి మోసం చేశారంటూ ఆవేదన

స్పందనలో వినతినిచ్చిన అనంతరం బెల్లం దిమ్మలు చూపుతున్న రైతులు

బెల్లం రైతుల్ని ముంచేశారు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో గడిచిన నాలుగేళ్లగా సేంద్రియ వ్యవసాయం పెరుగుతోంది. గతంలో పాచిపెంట మండలంలో సేంద్రియ ఎరువులతో సాగుచేసిన పత్తి విదేశాలకు ఎగుమతి చేయడం, ఇక్కడి పత్తితో తయారు చేసిన టీషర్ట్‌లకు ఎంతో గిరాకి ఉండడం వంటి వార్తలు విధితమే. దీంతో, పత్తికి మంచి గిరాకీ కూడా పెరింగింది. అదే మాదిరిగా జిల్లాలో సేంద్రియ ఎరువులతో సాగుచేస్తున్న చెరకుతో తయారు చేసిన బెల్లాన్నీ తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యాన తయారు చేస్తున్న లడ్డూలకు ఉపయోగిస్తామంటూ గడిచిన ఫిబ్రవరిలో అప్పటి కలెక్టర్ ఎ.సూర్యకుమారి అభయం ఇచ్చారు. ఆమె ఆదేశాలతో బొబ్బిలి మండలం కోమటిపల్లి, బాడంగి మండలం ముగడ గ్రామాల్లోకి వచ్చిన వ్యవసాయశాఖ, రైతు సాధికార సంస్థ అధికారులు అప్పటికే ఆయా గ్రామాల్లో తయారుచేసిన బెల్లాన్ని టెస్టింగ్ కోసం టిటిడి దేవస్థానానికి పంపారు. నాణ్యత బాగానే ఉందని అక్కడి నుంచి సమాచారం అందినట్టుగా రైతులకు చెప్పారు. దీంతో, సేంద్రియ ఎరువులతో చెరకు సాగుచేస్తున్న రైతులను కలిసి సాగు పద్ధతులు మొదలుకుని, బెల్లం తయారీ, అచ్చుల పరిమానం వరకు రకరకాల సూచనలు చేశారు. అధికారులు ఎంతో శ్రద్ధ చూపుతూ దగ్గరుండి ఇ-క్రాప్ కూడా నమోదు చేశారు. బ్యాంకు ఖాతా నెంబర్లు కూడా తీసుకున్నారు. దీంతో, రైతులు సాగు మొదలుకుని, బెల్లం తయారీ, బెల్లం అచ్చుల సైజు వరకు అధికారులు సూచించిన పద్ధతిలో గత ఏడాది డిసెంబర్ నాటికి బెల్లం తయారు చేశారు. నాటి నుంచి నేటి వరకు అదుగో ఇదిగో అంటూనే నెట్టుకొచ్చారు. ప్రస్తుతం ఈ రెండు గ్రామాలకు చెందిన రైతుల వద్ద సుమారు 50 టన్నుల బెల్లం నిల్వలు ఉన్నాయి.

> 'మీరు తయారు చేస్తున్న బెల్లం ఏకంగా వెంకటేశ్వర స్వామి (తిరుమల తిరుపతి దేవస్థానం) ప్రసాదం లడ్డూ తయారీకి ఉపయోగిస్తామంటూ ఆశలు కల్పించిన అధికార యంత్రాంగం చివరికి మోసం చేసిందంటూ జిల్లాలోని కొంతమంది బెల్లం రైతులు లబోదిమంటు న్నారు. బెల్లం తయారు చేసి ఐదు నెలలు కావస్తున్నా ఇప్పటికీ కొనుగోలు చేయలేదని, ఇప్పటి వరకు అదుగో ఇదిగో చివరకు రిలయన్స్, మోర్‌వంటి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు చూస్తున్నారని, అదే జరిగితే తమకు నష్టమే తప్ప లాభం వచ్చే అవకాశం లేదని వాపోతున్నారు. తమ సమస్య పరిష్కరించాలంటూ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం'కు వచ్చిన బెల్లం రైతులు ప్రజాశక్తి ఎదుట తమ ఆవేదన వెల్లగక్కారు.

దీంతో, బెల్లాన్ని నిల్వ చేసుకునేందుకు చోటు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. శీతలగిడ్డంగుల సదుపాయం కూడా ప్రభుత్వం తరపున కల్పించకపో వడంతో బెల్లపు అచ్చుల్లో తరుగు కనిపిస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కేజీ రూ.80 చొప్పున కొనుగోలు చేస్తామంటూ అధికారులు ఆశ చూపించారని, వారి సూచనల మేరకు ఇంతకు ముందు 15కేజీల పరిమాణంలో తయారుచేసిన బెల్లపు అచ్చులను 1కేజీ చొప్పున తయారు చేశామని చెబుతున్నారు. ఇందుకోసం సమయం, శ్రమ ఎక్కువైందని, ప్యాకింగ్ తదితరాలకు కూలీలను కూడా పెట్టుకున్నామని, మదుపు కూడా రూ.లక్షల్లో అయ్యిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో, రైతుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. పెట్టుబడుల కోసం చేసిన అప్పులు తీర్చలేక, వడ్డీలు కట్టుకోలేక ఆర్థికంగా అవస్థలు పడుతున్నారు. అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఉలుకూ పలుకూ లేదు. దీంతో, కోమటిపల్లికి చెందిన అట్టాడ రాములు, అట్టాడ తిరుపతిరావు, నారాయణ, లక్ష్మీకాంతం, మాదవ రావు ముగడ గ్రామానికి చెందిన మరికొంతమంది రైతులు కలెక్టరేట్‌లో నిర్వహిం చిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మికి ఫిర్యాదు చేశారు. అనంతరం అక్కడికి వచ్చిన ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబును కూడా కలిసి తమ సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా వారు ప్రజాశక్తితో మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం తరపున ఎందుకు కొనుగోలు చేయడం లేదో చెప్పాల్సిన అధికారులు రిలయన్స్, మోర్ వంటి కార్పొరేట్ సంస్థలకు విక్రయిస్తామంటూ చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సంస్థలు రూ.80చొప్పున కొనుగోలు చేస్తాయా? అంటూ ప్రశ్నిస్తున్నారు. అంతే కాకుండా కేజీల చొప్పున తయారు చేసి నాలుగైదు నెలలు కావడంతో పెచ్చులు ఊడి రంగుమారి పోయాయని, ఈ పేరుతో ఆయా సంస్థలు ధర తగ్గించే ప్రమాదం ఉంటుందని అభిప్రాయ పడుతున్నారు. ఇందుకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఇప్పటి వరకు నాలుగుసార్లు కలెక్టరేట్‌కు వచ్చి ఫిర్యాదు చేశామని, అయినా తమ సమస్య పరిష్కారానికి చొరవ చూపడం లేదని కంటతడి పెట్టారు.

గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ స్పందనకు గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి హెచ్చరించారు. సోమవారం స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో నిర్వహించారు. రెండు జిల్లాల నుంచి అధికారులు తప్పనిసరిగా రావాలన్నారు, గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల అధికారులకు హాజరు వేశారు. అలాగే అర్జీదారులకు సచివాలయాల్లో అన్ని సేవలు అందుతున్నాయని, మీ సేవలకు వెళ్లరాదనే సూచనలు, సలహాలిచ్చారన్నారు. కంటమానుగూడకు చెందిన సురేష్ లగేజ్ ఆటో లోన్ మంజూరు చేయాలని కోరారు. కొండచొర్లంగికి చెందిన అప్పలమ్మ కంప్యూటర్ కాటా మంజూరు చేయాలని కోరారు. ఆంపూరకు చెందిన తేజేశ్వరరావు పెయింటింగ్ సామాన్లు కొనుగోలుకు ఆర్థిక సహాయం అందించాలన్నారు. ఇల్లయ్యపురం చెందిన బాలయ్య మేకలకు రుణాలు ఇప్పించాలని కోరారు. మెట్టు గూడకు చెందిన చిన్న బూధమ్మ హౌసింగ్ బిల్లు మంజూరు చేయాలని కోరారు. బిల్లగూడకు చెందిన అప్పన్న ఆయిల్ ఇంజిన్ పైపులు మంజూరు చేయాలని విన్నవించారు. సవర ముకుందాపురంకు చెందిన భాస్కరరావు వాటర్ ట్యాంక్ మంజూరు చేయాలని కోరారు. కొండాడకు చెందిన బాలరాజు సిసి రోడ్డు మంజూరు చేయాలని కోరారు. స్పందన కార్యక్రమంలో డిడి నగేష్, ఎపిఒ రోషి రెడ్డి. ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ జి.మురళి, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయ పార్వతి, సిడిపిఒ రంగ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ

ఈనెల 19న స్థానిక ప్రభుత్వ ఐటిఐలో నిర్వహించనున్న జాబ్‌మేళా వాల్‌పోస్టర్‌ను ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి సోమవారం తనకార్యాలయంలో ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో నింఈ జాబ్ మేళా నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఐటిఐ ప్రిన్సిపల్ టివి గిరి, తదితరులు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు 7032060773, 6305110947 ఫోన్ నెంబర్లు సంప్రదించాలి.

తాగునీటి కోసం గ్రామస్తుల రాస్తారోకో

ప్రజాశక్తి - సీతానగరం

జాతీయరహదారిపై ఆందోళన చేస్తున్న జోగింపేట గ్రామస్తులు

మండలంలోని జోగింపేట గ్రామస్తులు తాగునీటి కోసం సోమవారం జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తాగునీటి కోసం అనేక కష్టాలు పడుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించడం లేదన్నారు. గత్యంతరం లేక రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు వాపోయారు. జాతీయ రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోవడంతో పోలీసులు చేరుకొనే ప్రయత్నం చేశారు. అప్పటికే ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ పవన్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని పైపుల పనులు చేయడంతో రెండు రోజుల్లో తాగునీరు అందిస్తామని చెప్పారు. దీంతో గ్రామస్తులు శాంతించి ఆందోళన విరమించారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం

ప్రజాశక్తి - కలెక్టరేట్

స్పందన దరఖాస్తులకు సకాలంలో పరిష్కారం చూపాలని, పరిష్కారం అర్జీదారులు సంతృప్తిపడేలా ఉండాలని, అర్జీ తిరిగి రీ-ఓపెన్ కాకూడదని సంయుక్త కలెక్టరు సి.విష్ణుచరణ్ తెలిపారు. సోమవారం జిల్లాకలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జెసి, డిఆర్ఒ జె.వెంకట్రావు ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్పందన కార్యక్రమంలో 84 సామాజిక, వ్యక్తిగత అర్జీలు ప్రజలు అందజేశారు.

నేడు పలు చోట్ల విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో 33/11 కెవి, 11కెవి ఫీడర్ నిర్వహణ పనుల నిమిత్తం మంగళవారంఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఎఇ ఒక ప్రకటనలో తెలిపారు. బైపాస్ కాలనీ, అజయ్ నగర్, బాలాజీ థియేటర్ ఎదురు రోడ్డు, నెహ్రూ కాలనీ, గాంధీ సత్రం, దేవీనగర్, పార్వతీనగర్, సారికవీధి, అరకాల వీధి, మేదర వీధి, ఇందిరా కాలనీ, తాళాబత్తుల వీధి, కుమ్మర వీధి, లింగం వీధి, బొగ్గుల వీధితో పాటు పలు వీధుల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

అర్బన్ హెల్త్ సెంటర్‌లో డిఎంహెచ్ఒ తనిఖీ

ప్రజాశక్తి - పాలకొండ

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు సోమవారం తనిఖీ చేశారు. కేంద్రం పరిధిలో వైద్య సేవలు పకడ్బందీగా అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఫ్యామిలీ డాక్టరు విధానంలో వైద్యులు వెళ్తున్న గ్రామాల్లో వైద్య సేవలు పక్కాగా అందించాలని ఆదేశించారు. రక్తహీనత, మధుమేహం, బిపి వ్యాధులను పరిశీలించాలని, వాటిపై అవగాహన కల్పించాలని అన్నారు. గర్భిణీలు, కదల్లేని స్థితిలో ఉన్న వారి వద్దకు వెళ్లి వైద్య సేవలు అందించాలని ఆయన చెప్పారు. అంటువ్యాధులు, అంటువ్యాధులు కాని వాటిపైన స్పష్టమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు. పట్టణ ఆరోగ్య కేంద్రంలో సేవలు విస్తృతం చేయడంతో పాటు, అన్ని పరికరాలు, మందుల అమరిక చక్కగా ఉండి, పరిశుభ్రంగా ఉంచాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పరికరాలు అందజేస్తున్న జెసి విష్ణుచరణ్

క్రీడా పరికరాలు పంపిణీ

పార్వతీపురం: జిల్లాలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణా శిబిరాలకు క్రీడా పరికరాలను, విద్యార్థులకు సర్టిఫికెట్లను జాయింటు కలెక్టరు సి.విష్ణుచరన్ పంపిణీ చేశారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో శిక్షణా శిబిరాలకు క్రీడాపరికరాలు, విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్రీడల చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో 50 క్రీడా శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి క్రీడా శిక్షణా శిబిరానికి ప్రభుత్వం రూ.7వేలు కేటాయించిందని, దానిలో రూ.4వేలతో మెటీరియల్ కొనుగోలు, రూ.2వేలు కోచ్ రెమ్యునరేషను, వేయిరూపాయలు ఇతర ఖర్చులకు కేటాయించినట్లు తెలిపారు. 50 క్యాంపుల్లో ప్రస్తుతం 922 బాలురు, 512 మంది బాలికలు హాజరగుతున్నారని, వేసవిలో క్రీడా శిబిరాలను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో గల ప్రతిభను వెలికి తీసేందుకు అవకాశం ఏర్పడుతుందని,వారిలో శారీరక దారుఢ్యం, పఠనాశక్తి పెరుగుతుందన్నారు. వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను ఈ నెల 1నుంచి 31 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఒ జె.వెంకటరావు, డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్, కోచ్ లు పాల్గొన్నారు.

నిర్మానుష్యమైన రహదారులు

పార్వతీపురంటౌన్ : పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో సోమవారం పట్టణంలోని ప్రధాన రహదారులన్ని జనసంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. ఉదయం 8 గంటల నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపడంతో రహదారిపైకి వచ్చేందుకు ప్రజలు భయపడి ఇళ్లకే పరిమితమయ్యారు. మూడు రోజుల వరకు ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయని వాతావరణ నిపుణులు హెచ్చరించడంతో ఈ పరిస్థితి కనబడింది. ఉష్ణోగ్రతల కారణంగా ఉక్క పోతతో జనం అవస్థలు పడ్డారు.

పలుచోట్ల టిడిపి సంఘీభావ ర్యాలీలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

పార్వతీపురం పట్టణంలో ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపడుతున్న యువగళం పాదయాత్ర వంద రోజులు మైలురాయిని చేరుకున్న సందర్భంగా సోమవారం పార్వతీపురంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ జరిగింది. తొలుత స్థానిక పాత బస్టాండ్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రారంభించారు. పట్టణంలో ప్రధాన రహదారి గుండా సాగిన ఈ పాదయాత్ర వెంకంపేట ఘోరీలు, నర్సిపురం నుంచి సీతానగరం మండలం ప్రవేశద్వారం మరిపివలస వరకు కొనసాగింది. నియోజకవర్గంలోని సీతానగరం బలిజిపేట, పార్వతీపురం నుండి పెద్ద ఎత్తున కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు జి.రవికుమార్, డి.మోహనరావు, కె.తిరుపతిరావు, పి.వేణుగోపాలనాయుడు, నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, గర్భాపు ఉదయభాను, బోను చంద్రమౌళి, జాగాన రవికుమార్ ధనుంజయ పాల్గొన్నారు.

సాలూరు: లోకేష్ పాదయాత్ర ప్రారంభించి వందరోజులు పూర్తయిన సందర్భంగా టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి ఆధ్వర్యాన స్థానిక ఆర్టీసి కాంప్లెక్స్ నుంచి బయలుదేరి మండుటెండలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పట్టణంలోని ప్రధాన రహదారి మీదుగా యాత్ర కొనసాగించారు. నాలుగు మండలాల నుంచి భారీగా నాయకులు కార్యకర్తలు తరలివచ్చారు. కార్యక్రమంలో టిడిపి పరిశీలకులు మూర్తి యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్ దేవ్, పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, అర్బన్ బ్యాంక్ మాజీ అధ్యక్షుడు కూనిశెట్టి భీమారావు, మక్కువ, పాచిపెంట మండల పార్టీ అధ్యక్షులు జి.వేణుగోపాల్, ముఖీ సూర్యనారాయణ, మెంటాడ మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

కురుపాం : నారా లోకేష్ యువ గళం పాదయాత్ర వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్చార్జి టి. జగదీశ్వరి గరుగుబిల్లి మండలం తోటపల్లి దేవస్థానంలో వెంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం తోటపల్లి నుంచి నాగూరు వరకు పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఐదు మండలాల కన్వీనర్లు కెవి కొండయ్య, అక్కేని మధు, శేఖర్ పాత్రుడు, పల్లా రాంబాబు, నాయకులు డొంకాడ రామకృష్ణ, కోలా రంజిత్ కుమార్, జియ్యమ్మవలస ఎంపిపి బొంగు, పలువురు నాయకులు, యువత, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: నారా లోకేష్ పాదయాత్ర వంద రోజులకు సంఘీభావంగా అరకు పార్లమెంటు తెలుగు యువత అధ్యక్షులు వారాడ సుమంత్ నాయుడు, రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు ఖండాపు వెంకట రమణమూర్తి ఆధ్వర్యంలో సోమవారం కోటదుర్గ గుడిలో నారా లోకేష్ పేరు మీద పూజలు చేశారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి పాదయాత్రను నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలు, మున్సిపాలిటీ సంబంధించిన ఎంపిపిలు, జెడ్‌పిటిసి సభ్యులు, సర్పంచులు, ఎంపిటిసిసభ్యులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ విగ్రహం నుండి యలాం జంక్షన్లో అంబేద్కర్ విగ్రహం వరకు పాదయాత్ర కొనసాగింది. ఈ పాదయాత్రలో నియోజకవర్గంలోని నాయకులు పైల సత్తిబాబు, గుమ్మడి సింహాద్రి, సి ఎల్ నాయుడు, పడాల భూదేవి, దమయంతి నాయుడు, పాలక రాజబాబు, మాలయ్య, కుంపి, హారిక లక్ష్మయ్య, సీతంపేట మండలం సర్పంచులు, ఎంపీటీసీలు కార్యకర్తలు పాల్గొన్నారు.

పొగాకు నిషేధంపై ర్యాలీ

వీరఘట్టం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వైద్యాధికారి జి.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో పొగాకు నిషేధంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి జి.ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ పొగాకు తాగడం వల్ల ఊపిరితిత్తులు పాడవడంతో పాటు కేన్సర్ కూడా వచ్చే ప్రమాదం ఉందని, పొగాకు పీల్చినవారు తక్షణమే మానివేయాలని సూచించారు. కార్యక్రమంలో మల్టీపర్పస్ ఎగ్జిక్యూటివ్ అధికారి జగన్నాథరావు, సూపర్వైజర్లు పార్వతి, శాంతకుమారి, హెల్త్‌ఎడ్యుకేటర్ ఆదిలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో 104 యూనియన్, (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో ఉద్యోగులు స్పందన కార్యక్రమంలో ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రతి నెలా సక్రమంగా వేతనాలు చెల్లించాలని, బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని, ఎంఎంయు వాహన సేవలను గతంలో వలె రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని, ముఖ్యమంత్రి హామీ మేరకు 104 ఎంఎంయు ఉద్యోగులను కాంట్రాక్ట్/ఆప్కోస్‌లో నేరుగా అబ్జార్బ్ చేసే ఉద్యోగ భద్రత కల్పించాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 104 ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలనీ, పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, 104 యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆనందరావు, కోశాధికారి జగదీష్, కమిటీ సభ్యులు కె.ఈశ్వరరావు, శివ, సిఐటియు కోశాధికారి గొర్లి వెంకటరమణ, శ్రామిక మహిళ నాయకులు ఇందిర పాల్గొన్నారు.



జెసికి వినతిని అందజేస్తున్న సిఐటియు నాయకులు, 104 ఉద్యోగులు

తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

పేదలకు పట్టాలివ్వాలని గిరిజనుల ధర్నా

సాలూరు : మునిసిపాలిటీ పరిధిలో ఉన్న బంగారమ్మ కాలనీకి చెందిన నిరుపేద గిరిజనులకు ప్రభుత్వ స్థలంలో పట్టాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం గిరిజన సంఘాల ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. 14వార్డు కౌన్సిలర్ పి.మధుసూదన రావు, గిరిజన సంఘం నాయకులు భగవాన్ ఆధ్వర్యాన కాలనీకి చెందిన ఎరుకలి కులస్తులు మండల తహశీల్దార్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాలనీలోని ప్రభుత్వ స్థలంలో ప్రజలందరికీ ఉపయోగపడే భవనాలు నిర్మించాలని, లేకపోతే పేదలకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. కాలనీకి చెందిన కొంతమంది పెత్తందార్లు బోగస్ పట్టాలతో ఇళ్ల నిర్మాణానికి ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. వారం రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ రామస్వామి, మున్సిపల్ కమిషనర్ హెచ్.శంకరరావుకు వినతిపత్రాలు అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలని గిరిజనుల ర్యాలీ

ప్రజాశక్తి -పాచిపెంట

తమ గ్రామంలో దీర్ఘకాలంగా పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని పెద్దవలస పంచాయతీ మూలవలస గిరిజనులు ఆ గ్రామం వద్ద గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు బోయిన లక్ష్మణ దొర, తుమ్మురవల్లి ఆనందరావు, రాము ఆధ్వర్యంలో మాట్లాడుతూ స్వాతంత్య్రం 75ఏళ్లు దాటినా తమ గ్రామంలోని గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూలవలస నుంచి పద్మాపురం వరకు రహదారి నిర్మాణం చేపట్టాలన్నారు. మళ్లీ వర్షాలు పడితే వరద ఉధృతికి మానాలగెడ్డ వద్ద వంతెన లేకపోవడం వల్ల అష్ట కష్టాలు నిత్యం పడుతూనే ఉన్నామని అయినా ఎన్ని ప్రభుత్వాలు మారినా తమ బతుకులు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రహదారి విషయంలో అధికారులు, ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. షెడ్యూల్ గ్రామంగా ప్రకటించాలని పీసా చట్టం అమలు చేయాలని, పూర్తిస్థాయిలో అటవీ పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బోయ, వాల్మీకులను ఎస్టిలో చేర్చే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వం మానుకుంటే మంచిదని హెచ్చరించారు. సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యం వల్ల గిరిజనులు బతుకులు మారలేదని ఇప్పటికైనా మౌళిక సదుపాయాలపైన ప్రభుత్వం దృష్టి పెట్టాలని, నాన్ షెడ్యూల్ గ్రామాలన్నీ షెడ్యూల్ గ్రామాల్లో చేర్చి గిరిజనులకు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. గిరిజన చేస్తున్న పోరాటానికి ప్రజాసంఘాలు సంపూర్ణ మద్దతు తెలియజేస్తాయని తెలిపారు. గిరిజన హక్కుల కోసం గిరిజనులు సంఘటితంగా పోరాడాలని అన్నారు.

నిరసన తెలుపుతున్న మూలవలస గిరిజనులు

రెడ్డివానివలసలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - కలెక్టరేట్

జ్వరాల తీవ్రతతో ప్లేట్లెట్లు తగ్గిపోయి, డెంగీగా విస్తరిస్తున్న రెడ్డివానివలసలో వైద్య శిబిరాలు నిర్వహించి, రక్త నమూనాలు సేకరించి వ్యాధి నివారణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు జాయింట్ కలెక్టర్‌కు వినతిని అందజేశారు. సీతానగరం మండలంలో రెడ్డివానివలసలో గత నెల రోజులుగా జ్వరాలు తీవ్రంగా వస్తున్నాయని, ప్రభుత్వ సిబ్బంది గ్రామంలో పర్యటించి నిర్లక్ష్యంగా వైద్యం చేయడంతో జ్వరాలు విస్తరించి ప్రైవేటు హాస్పిటల్లో చేరిన వెంటనే ప్లేట్లెట్స్ అమాంతంగా తగ్గిపోతున్నాయి. డెంగీ కేసులుగా నమోదవుతున్నాయని, విశాఖ హాస్పిటల్లో చేరినా జ్వరాలు తగ్గని పరిస్థితి ఉందని, దీనిపై వైద్యాధికారులు చర్యలు తీసుకొని జ్వరాలు తగ్గే వరకు డాక్టర్ల పర్యవేక్షణలో గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించాలని కోరారు. ప్రతి ఏటా ఈ పరిస్థితి ఉంటుందని వైద్య ఆరోగ్యశాఖ ముందు జాగ్రత్త చర్యలుగా దీనికి కారణాలను పరిశీలించి రక్త నమూనాలు సేకరించి గ్రామంలో ఆరోగ్యాన్ని పరిరక్షించాలని గ్రామ పెద్దలు, ప్రజలు రెడ్డి ఈశ్వరరావు, రెడ్డి లక్ష్మణనాయుడు, రమణమూర్తి, తవిటినాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేస్తూ, కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఇదిలా ఉండగా, గ్రామంలో జ్వరాలపైన, ప్రజా వద్దకు ఈ రోజు వెళ్లిన సీతానగరం వైద్య సిబ్బంది నానా దుర్భాషలాడటం సరైన చర్య కాదని దీనిపై జిల్లా అధికారులు వెంటనే చర్య తీసుకోవాలని రెడ్డి వేణు కలెక్టర్ కార్యాలయంలోని స్పందన కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒను కోరారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ సి .విష్ణు చరణ్ స్పందిస్తూ అన్ని సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ముంగారమ్మకు పూజలు చేస్తున్న రాజన్నదొర

ముంగారమ్మను దర్శించుకున్న రాజన్నదొర

సాలూరు రూరల్ : మండలంలోని మామిడిపల్లి గ్రామ దేవత ముంగారమ్మను సోమవారం డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల తర్వాత వచ్చిన ఈ పండగను గ్రామస్తులంతా కలసి మెలసి జరుపుకోవాలని కోరారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిరంతరం మంచినీటి సౌకర్యం, విద్యుత్, పారిశుధ్యం నిర్వహణకు సంంధించిన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు దండి శ్రీనివాసరావు, సువ్వాడ శ్రీనివాసరావు, సువ్వాడ రామకృష్ణ, బూస తవుడు, పెద్దింటి మాధవరావు పాల్గొన్నారు.

మహిళకు కరపత్రాలు అందజేస్తున్నఎమ్మెల్యే జోగారావు

కవిటిభద్రలో గడపగడపకు మన ప్రభుత్వం

పార్వతీపురం రూరల్ : మండలంలోని కవిటిభద్రలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యాన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను ఆదుకోవాలని, ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతో అవినీతికి తావు లేకుండా ప్రత్యక్షంగా లబ్ధిదారుల ఇళ్లకే పథకాలు అందిస్తున్న ప్రభుత్వం తమదని అన్నారు. కార్యక్రమంలో సర్పంచి ఆంద్రాపు ఉషారాణి , ఆత్మ చైర్మన్ తిరుపతిరావు జడ్పిటిసి బలగ రేవతి, ఎంపీపీ మజ్జి శోభారాణి, ఏఎంసీ చైర్మన్ ఎం భాగ్యలక్ష్మి పిఏసిఎస్ చైర్మన్ శివున్నాయుడు, స్థానిక సర్పంచ్ తీళ్ల కృష్ణారావు, నాయకులు భీమవరపు కృష్ణమూర్తి, బలగ నాగేశ్వరరావు, బొమ్మి రమేష్, మజ్జి చంద్రశేఖర్, వాసుదేవరావు, మడక విశ్వనాథం, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

నైట్ వాచ్‌మేన్ పోస్ట్ నియామకం వాయిదా

వీరఘట్టం: మండలంలోని కంబరవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నైట్ వాచ్మెన్ పోస్టుకు సంబంధించి సోమవారం ఎంఇఒ ఎ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పాఠశాలలో పేరెంట్స్ కమిటీతో గ్రామసభ నిర్వహించారు. పేరెంట్స్ కమిటీ సభ్యులు 9మంది ఉండగా అందులో కుక్ భర్తకు పోస్ట్ ఇచ్చేందుకు ప్రతిపాదించగా ఇద్దరు మాత్రమే అంగీకరించారు. మిగిలిన ఏడు మంది సభ్యులు నిరాకరించడంతో మరోసారి నైట్ వాచ్మెన్ పోస్ట్ నియామకం వాయిదా పడినట్లు ఎంఇఒ తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.భాస్కరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎం.రవి, ఉపాధ్యాయ సిబ్బంది, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం

సీతంపేట : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం 8వ రోజున పిల్లలు గ్రంథాలయానికి వచ్చి విజ్ఞానపరమైన పరిజ్ఞాన పుస్తకాలు చదివారు. ఎక్కువ మంది విద్యార్థినులు పాల్గొన్నారు. సహాయకుడు రామకృష్ణ పాల్గొన్నారు.

పాలకొండ: స్థానిక శాఖా గ్రంథాలయంలో తంపటాపల్లి డ్రాయింగ్ మాస్టర్ గొర్లె మురళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రాఫ్ పెయింటింగ్ ఎలా చేయాలో పిల్లలకు నేర్పించారు. విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. ఇంఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్‌బాబు, సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

19న పైనాపిల్ మార్కెటింగ్ పై సమావేశం

సీతంపేట : ఈనెల 19న పైనాపిల్ మార్కెటింగ్‌కు ఉన్న అవకాశాలపై సమావేశం నిర్వహించనున్నట్లు ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. ఈ సమావేశంలో పైనాఫిల్ అమ్ముకోవడానికి రైతులకు అనుమతులివ్వడం ప్రారంభిస్తామని తెలిపారు. ఈ సమావేశానికి ఉద్యానశాఖ అధికారులు, రైతులంతా హాజరుకావాలని పిఒ కోరారు.

చర్చి నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఐ విరాళం

కొమరాడ :మండలంలోని తులసివలసలో చర్చి నిర్మాణానికి విశాఖపట్నం ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రి సిఇఒ తుమరాడ చంద్రమౌళి విరాళాన్ని అందించారు. మాదలింగికి చెందిన చంద్రమౌళీ శ్వరరావు తనవంతు సహాయంగా రూ.25వేలును తన ప్రతి నిధులు ఎస్.మహేష్, ఎస్.మోహనరావు, రాగాల సంతోష్, కొమ్ము వెంకటరమణ, జన్నిపువ్వల చిన్నయ్య, నాలి గుంపస్వామీ మరియు మీసాల ఉమా మహేష్ ద్వారా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆ గ్రామ సర్పంచ్, సంఘ పెద్దలు, గ్రామ పెద్దలు సిఇఒకు కృతజ్ఞతలు తెలిపారు.

సార్లొస్తే.. దుకాణాలు మూత

వీరఘట్టం : దుకాణాలు తనిఖీలకు సార్లు వస్తే విషయం తెలుసుకొని అయ్యగార్లు దుకాణాలు చక చక మూసి వేస్తున్నారు. ఇదే పరిస్థితి సోమవారం వీరఘట్టంలోని పలు దుకాణాలు మూతపడ్డాయి. సరుకుల నాణ్యత ప్రమాణాలతో పాటు తూనికలు, కొలతల్లో ఎటువంటి వ్యత్యాసాలు ఉంటాయేమోనని గుర్తించి సంబంధిత వ్యాపారులపై ఫుడ్ ఇన్స్పెక్టర్లు తనిఖీలు చేయడం ఆనవాయితీ. ఇదే అదునుగా కొంతమంది వ్యాపారులు పెనాల్టీలకు గురికాకుండా ఉండేందుకు ఒక దుకాణాల్లో తనిఖీ చేశారంటే మిగిలిన వారంత దుకాణాలు మూసి వేస్తున్నారు. అంటే కొలతల్లో నాణ్యతా ప్రమాణాలు ఉండకపోవడంతో పాటు న్యాయమైన సరుకులు అమ్మకాలు జరపడంలేదని అర్థం చేసుకోవచ్చునని దీనికి ఇదే నిదర్శనం. ఫుడ్ ఇన్స్పెక్టర్లు గుట్టుచప్పుడుగా వస్తే డొల్లతనం బయటపడుతుంది. నాసిరకమైన వస్తువుల అమ్మకాల వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం గుర్తించి వెంటనే వాటిని పరిష్కరించాలని వికలాంగుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు కానూరి శంకరరావు అన్నారు. సోమవారం పార్వతీపురం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏడాదిగా పెండింగులో ఉన్న త్రీవీలర్ బ్యాటరీ స్కూటీలను అర్హులకు వెంటనే పంపిణి చేయాలని డిమాండ్ చేశారు. మన్యం జిల్లాలో విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల హిజ్రాల సంక్షేమ శాఖకు కార్యాలయం ఏర్పాటుచేసి, సంబంధిత సిబ్బందిని నియమించి వికలాంగులకు అందుబాటులో వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. దివ్యాంగులకు ఇచ్చే వివాహ ప్రోత్సాహం, కల్యాణమస్తు పథకంలో విద్యార్హతతో సంబంధం లేకుండా పదో తరగతిని మినహాయించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, 25ఏళ్లు పైబడిన పైళ్లు కానీ దివ్యాంగులకు ప్రత్యేకమైన వారుగా ప్రభుత్వం గుర్తించి వారి కుటుంబాలతో సంబంధంలేకుండా అంత్యోదయ రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. వికలాంగుల కుటుంబాల్లో ప్రభుత్వ, ప్రభుత్వ విభాగంలో కాంట్రాక్టు ఉద్యోగస్తులు ఉన్నారనీ సిక్స్ స్టెప్ వాలిడేషన్ పేరుతో ఆ కుటుంబంలో ఉన్న పూర్తి స్థాయి దివ్యాంగుల పింఛన్లు తొలగించడం తగదన్నారు. కాబట్టి సిక్స్ స్టెప్ వాలిడేషన్‌లో వికలాంగుల ప్రత్యేకంగా మినయించి తొలగించిన ఫించన్లు తిరిగి పునరుద్ధరించాలని కోరారు. వికలాంగులకు ఇచ్చే స్కూటీలు విషయంలో సదరం సర్టిఫికెట్లో వైకల్యాన్ని ఆధారం చేసుకుని 70శాతం పైబడిన వికలాంగులందరికీ విద్యార్హత సంబంధం లేకుండా మోటరైజేడ్ వికలాంగుల స్కూటీలు మంజూరు చేయాలని, విద్యార్హత పదవ తరగతిని ఈ పథకంలో మినహాయించాలని, అలాగే అనేక నిబంధనలు పెట్టి దివ్యాంగులు మోటార్ స్కూటీలు లిమిటెడ్‌గా ఇచ్చి వికలాంగుల మధ్య విభేదాలు రాకుండా అందరికీ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటి అధ్యక్షులు సురేష్, సెక్రటరి సంబంగి భాస్కర రావు, మహిళా అధ్యక్షులు పట్నాల రాధ, కార్యవర్గ సభ్యులు రమేష్, గంగులు మరియు ఇతర మండల సభ్యులు పాల్గొన్నారు.

విద్యా కానుకలు సక్రమంగా అందించాలి : డిఇఒ

ప్రజాశక్తి - కొమరాడ

అర్హులైన ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుకలు సక్రమంగా అందించాలని డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ అన్నారు. సోమవారం కోటిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన జగనన్న విద్యా కానుక కిట్లు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రారంభం నాటికి విద్యార్థులకు కిట్లు పంపడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి విద్యార్థికి ఈ కిట్లను సక్రమంగా అందించాలని, ఎటువంటి లోపాలు లేకుండా కిట్లు అన్ని వస్తువులు సక్రమంగా ఉండేలా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే కిట్లు అవకతవకలు లేకుండా పుస్తకాలు, వస్తువులు ముందస్తుగానే సిద్ధం చేసుకోవాల న్నారు. అనంతరం మండల కేంద్రంలో గల కేజీబివి పాఠశాల ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులను పరిశీలించారు. పార్వతీపురం పలు మండలాల నుంచి వచ్చిన ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులకు పరీక్షలు రాసేందుకు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మే 24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంఇఒ జామి నారాయణస్వామి, సిబ్బంది తదితరులున్నారు.

జగనన్న కిట్లలో పుస్తకాలను పరిశీలిస్తున్న డిఇఒ ప్రేమ్‌కుమార్

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - కొమరాడ

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఆదాయంతో పాటు ఆరోగ్యం కూడా వస్తుందని ఎంపిపి శెట్టి శ్యామల, జెడ్‌పిటిసి సభ్యులు ద్వారపురెడ్డి లక్ష్మి అన్నారు. మండలంలోని గంగరేగువలసలోని సోమవారం రైతు భరోసా కేంద్రంలో నవ ధాన్యాల కిట్లను ఎంపిపి, జెడ్‌పిటిసి సభ్యులు, సర్పంచ్ కోడి తిరుపతిరావు గ్రామంలోని పొలం బడి రైతులకు పంపిణీ చేశారు. ఈ సంద్భంగా రైతులతో వారు మట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో నేలను సారవంతం చేసుకోవడానికి 20 నుంచి 30 రకాల విత్తనాలు, ఎకరాకు 10 కేజీల చొప్పున తొలకరి వర్షాలు ముందు పొలం వేసుకోవాలని కోరారు. 45 రోజుల తర్వాత భూమిలో కలియదున్ని వేయడం వల్ల ప్రధాన పంటకు అవసరమైన అన్ని రకాల పోషకాలు సమృద్ధిగా లభిస్తాయని తెలిపారు. పురుగులు, తెగుళ్లను తట్టుకునే శక్తి కలిగి ఉంటాయని, నేల పైభాగంలో సారవంతమైన నల్లని హ్యూమస్ పొర ఏర్పడుతుందని రైతులకు వివరించారు. ప్రతి రైతు తమ కున్న విస్తీర్ణంలో తప్పనిసరిగా నవ ధాన్యాలు వేసుకొని అధిక దిగుబడులు సాధించాలని, ఖర్చులు కూడా తగ్గుతాయని, భూమిలోని రైతు మిత్రులైన వానపాములు అభివద్ధి చెందుతాయని అన్నారు. కార్యక్రమంలో ఎపిఎం వెంకట రమణ, ఎస్.మధుసూదనరావు, జనార్థన నాయుడు, ప్రకృతి వ్యవసాయం డివిజన్ ఇన్చార్జి అన్నపూర్ణ, అప్పలనాయుడు, మండల ఇంఛార్జి ప్రసాద్, భవాని, రైతులు పాల్గొన్నారు.

నత్త నడకప జలజీవన్ మిషన్ పనులు

కొమరాడ :మండల కేంద్రంలో జలజీవన్ మిషన్ పనులు నత్తనడకన సాగుతున్నాయని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. కొమరాడ పాత బిసి కాలనీలో చేపట్టిన జెజెఎం పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో జలజీవన్ మిషన్ పనులు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. ఇప్పటికే అనేక గిరిజన గ్రామాల్లో పనులు చేపట్టినప్పుడు కూడా అడపాదడపా తప్ప పూర్తిస్థాయిలో కొళాయి ద్వారా మంచి నీరు అందని పరిస్థితి ఉందని తెలిపారు. కొమరాడ పాత బీసీ కాలనీ వద్ద గత రెండు నెలలుగా ప్రారంభించిన జలజీవన్ మిషన్ పనులు నేటికీ పూర్తికాక ఒక్క చుక్క కూడా నీరందని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సందర్భంలో పాత బీసీ కాలనీలో అన్ని వీధిల్లో కొళాయిలు సగం బిగించారని, మిగతా సగం కోసం వేసి ఉండే పరిస్థితి ఉంది తప్ప పూర్తిస్థాయిలో ఎక్కడా కొళాయిలు బిగించిన పరిస్థితి లేదని అన్నారు. ఇప్పటికైనా జెజెం పనులు వేగవంతం చేసి ప్రజలకు తాగునీరందించాలని కోరారు.

చెరువు పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ రామచంద్రరావు

అమృత సరోవర్ నిర్మాణాలు సకాలంలో పూర్తి కావాలి

ప్రజాశక్తి - కొమరాడ

అమృత్‌సరోవర్ పథకంలో భాగంగా చేపడుతున్న చెరువులను అభివృద్ధి నిర్మాణ సకాలంలో పూర్తి చేయాలని డ్వామా పీడీ కె.రామచంద్రరావు అధికారులను ఆదేశించారు. మండలంలోని కంభవలస, కోనవలసలో జరుగుతున్న అమృత్‌సరోవర్ ట్యాంకు పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈనెల 20 నాటికి ట్యాంకు పనులన్నీ పూర్తి కావాలని అధికారులకు ఆదేశించారు. మండలంలో జాబ్ కార్డు ఉన్న ప్రతి వేతనదారుడికి ఉపాధి పని కల్పించేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి కూలీలు వడదెబ్బ బారిన పడకుండా ఉదయం ఏడు గంటలకే పనికి వెళ్లేలా సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. అలాగే నిబంధన ప్రకారం ప్రతి ఉపాధి కూలీలకు కొలతలు ఇచ్చి కనీస వేతనాలు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట ఎపిఒ బాలకృష్ణ, జెఇ సోమేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

సమీకృత వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - పాచిపెంట

సమీకృత వ్యవసాయంపై స్థానిక వెలుగు ఎంఎంఎస్ కార్యాలయంలో సోమవారం ఎఫ్‌పిఒ డైరెక్టర్, సిబ్బందికి శిక్షణ, అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఎం ప్రవీణ్ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి 5 నుండి 10 వ్యవసాయ, అనుబంధ కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఆర్థికంగా బలోపేతం చేయడమే సమీకృత వ్యవసాయం ఉద్దేశమన్నారు. 250 నుండి 300 కుటుంబాలను ఐఎఫ్‌సి క్లస్టర్ గా ఎంపిక చేసుకొని ఆదర్శంగా తయారుచేసి తర్వాత మండలమంతా సమీకృత వ్యవసాయం సాగు చేసేందుకు గానూ ప్రస్తుతం గ్రామాల్లో ఎఫ్‌పిఒ ద్వారా ఈ సమీకృత వ్యవసాయ విధానం సాగు చేస్తున్నట్టు తెలిపారు. మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు మాట్లాడుతూ ప్రతి రైతు ఏటా పంట మార్పిడి జరగాలని, చిరుధాన్యాలు సాగు చేసుకోవడానికి ముందుకు రావాలని, పచ్చిరొట్టె ఎరువుకు సంబంధించిన విత్తనాలు సబ్సిడీపై ఇవ్వనున్నట్టు తెలిపారు. కావున రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. పశుసంవర్ధకశాఖ అధికారి మాట్లాడుతూ పశు సంపద వల్ల రైతుల ఆదాయం ఏ విధంగా పెంచుకోవచ్చు అనేది వివరించారు. ఎపిఒ మాట్లాడుతూ ఉపాధిహామీ ద్వారా రైతులకు అందించే పథకాలను వివరించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడండి...

మక్కువ : నీటిని సక్రమంగా వినియోగించుకొని భావితరాలకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మండల అటవీ అధికారి నారాయణరావు అన్నారు. సోమవారం మక్కువలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేప లేఫ్ కార్యక్రమ సందర్భంగా ఆయన ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. వర్షపు నీరు సైతం భూమిలో ఇంకెలా అటవీశాఖ చర్యలు చేపట్టిందని, అలాగే గ్రామంలో ప్రజలు కూడా ప్రభుత్వాలు చేపట్టి ఇంకుడు గుంతల కార్యక్రమం భూగర్భ జలాలను పెంపొందించేందుకేనని ఆయన అన్నారు. మంచినీటిని సక్రమంగా వినియోగించాలని ఈ సందర్భంగా అందరిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు తైక్వాండో శిక్షణ

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక కిషోర్ చంద్రదేవ్ డిగ్రీ కళాశాలలో ఉచిత తైక్వాండో శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ కె.తిరుపతిరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో హెడ్ కోచ్ షేక్ ఆలీ, కోచ్ కె.రామకృష్ణ ద్వారా విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమైందని, ప్రతి రోజు ఉదయం 6 నుంచి 8 వరకు వేసవి సెలవుల వరకు ఇవ్వడం జరుగుతుందన్నారు. సోమవారం ఈ శిబిరానికి వైసీపీ వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు సందర్శించి విద్యార్థులకు గుడ్లు పంపిణీ చేశారు. ఈ సర్టిఫికేట్ వల్ల భవిష్యత్ ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు ఉపయోగ పడుతుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులంతా సభ్యులు చేసుకోవాలని కోరారు.

కరాటే విద్యార్థులతో కోచ్‌లు, హెచ్‌ఎం

ఉపాధి పనులు పరిశీలన

పాలకొండ రూరల్: మండలంలోని లుంబూరులో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపిడిఒ డొంక త్రినాధులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయపాలన పాటించి పనులు చేపట్టాలని వేతనదారులకు సూచించారు. ఎటువంటి సమస్యలు ఉన్న తన దష్టికి తీసుకురావాలని అన్నారు.

సీతానగరం : మండలంలోని వెంకటాపురం, చల్లమనాయుడువలస, కృష్ణరాయపురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపిడిఒ ఎంఎస్‌ఎల్ ప్రసాద్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులను ఈ ఏడాది పూర్తి చేయాలన్నారు. కొలతల ప్రకారం పనులు చేయాలని పనులు చేస్తే కూలి గిట్టుబాటు అవుతుందన్నారు. వేసవి కావడంతో ఉదయం 6 గంటలకు వచ్చి పదిగంటల్లోపు ముగించుకొని వెళ్లాలని సూచించారు. వడదెబ్బ తినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

వెంకటరాయుడుపేటలో వైద్యశిబిరం

పార్వతీపురంరూరల్ :మండలంలోని వెంకట్రాయుడుపేటలో వైద్యాధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ప్రతి గ్రామంలో రెండుసార్లు ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రామంలో 68 రకాల మందులు అందుబాటులో ఉన్నాయని వాటిని అందరూ వినియోగించుకోవాలని కోరారు. చిన్నారులు గర్భిణులు, వద్ధుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలు అందజేస్తున్నామన్నారు.

దశమంతపురంలో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం : మండలంలోని దశమంతపురంలో సోమవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి గర్భిణీలకు, మధుమేహం, రక్త పోటు తదితర రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నవోనమ్మ, టెక్నీషియన్, దినేష్, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

కుడ్డపల్లి సచివాలయం సందర్శన

సీతంపేట : మండలంలోని కుడ్డపల్లి సచివాలయాన్ని డిఎల్‌డిఒ గోపాలకృష్ణ సందర్శించారు. సచివాలయం ద్వారా ఎక్కువ సర్వీసులు అందించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సంక్షేమ పథకాలు గురించి తెలియజేయాలన్నారు. ఈయనతో పాటు ఎంపిడిఒ కొండపల్లి సత్యం, కార్యదర్శి వై పాపారావు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మొదటి, రెండవ సంవత్సర విద్యార్థులకు ఎకనామిక్స్ స్టడీ మెటీరియల్‌ను ప్రిన్సిపల్ బి.రేణుక చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు స్టడీ మెటీరియల్ ఉపయోగించుకొని మంచి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు అలాగే మార్చిలో జరిగిన పరీక్షల్లో తెప్పిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో లెక్చరర్లు తెర్లి రవికుమార్, వినోద్, ప్రసాద్ రావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని దశమంతపురం పాఠశాలలో సోమవారం ప్రధానోపాధ్యాయులు గంగారం ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. పాఠశాలలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వీటికి గ్రామస్తుల సహకారం ఎంతో అవసరమన్నారు. అనంతరం సచివాలయ డిడిఒ కె.సునీల్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

భవనంపై నుంచి జారిపడి కార్మికుడు మృతి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

స్థానిక చర్చి వీధిలో నిర్మాణమవుతున్న ఒక భవనం నుంచి జారిపడి భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. అవుట్ పోస్ట్ పోలీసుల వివరాలు ప్రకారం గరుబిల్లి మండలం పెద్దగొడపకు చెందిన కార్మికుడు భవన నిర్మాణ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌తో భవనం పై నుంచి జారిపడి తీవ్ర గాయాలు పాలైనట్లు తెలిపారు. ఆసుపత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. వివరాలు పట్టణ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించినట్లు తెలిపారు.

ఆటో బోల్తా : నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - కొమరాడ

ఆటో అదుపుతప్పి బోల్తా పడి నలుగురికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పెదమానాపురం మండలం కృష్ణాపురం నుంచి రైల్వే పనులు చేసేందుకు ఆటోపై కొమరాడ మండలం స్వామినాయుడు వలస రైల్వే గేట్ వద్దకు వస్తున్న ఆటో ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒకే గ్రామానికి చెందిన పల్లి ఈశ్వరరావు, వి.రమేష్, వై.రమణ, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రతిరోజు కృష్ణాపురం నుంచి రైలుపై మండలంలో పనులు చేసేందుకు వచ్చేవారని, అయితే సోమవారం పలు రైళ్లు రద్దు కావడంతో ప్రత్యామ్నాయ మార్గం లేక ఆటోపై పనులు చేసేందుకు వచ్చారు. ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో ప్రమాదం జరిగినట్లు ఆటోలో ఉన్న వారు తెలిపారు. విషయం తెలుసుకున్న కొమరాడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేశారు.

మనస్థాపంతో యువకుడు ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం రూరల్ : పట్టణం పెద మాదిగ వీధికి చెందిన గుంట ప్రతాప్ ఆర్థిక లావాదేవీలు విషయమై అత్తవారితో జరిగిన గొడవ కారణంగా మనస్థాపం చెంది ఆదివారం రాత్రి టౌను రైల్వే స్టేషన్ సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనంతరం ఇంటికి చేరుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లిపోవడంతో కుటుంబీకులు జిల్లా ఆసుపత్రికి తరలించడంతో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

మర్రిమానుగూడలో చోరీ

సీతంపేట : మండలంలోని దోనుబాయి పోలీస్ స్టేషన్ పరిధిలో గల మర్రిమానుగూడకు చెందిన సవర సోములు ఇంటిలో ఆదివారం రాత్రి భారీ చోరీ జరిగింది. బీరువాలో భద్రపరిచిన రూ.లక్షా70వేలు నగదు, మూడు తులాల బంగారం చోరీకి గురైంది. ఈ మేరకు సోములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీతంపేట ఎస్సై నీలకంతరావు తెలిపారు. ఈ చోరీ సంఘటనపై పాలకొండ సిఐ మురళీధర్ సంఘటన స్థలానికి వెళ్లి చోరీ ఎలా జరిగిందనే వివరాలను సేకరించారు. పార్వతీపురం నుంచి క్లూస్ టీమ్ము, వేలిముద్ర సేకరణ టీమును రప్పించి వేలిముద్రలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.